ప్రజాశక్తి
మంగళవారం 19 డిసెంబర్ 2023
5
అనంతపురం

అనంతపురం కలెక్టరేట్ ఎదుట పొర్లు దండాలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

వైసిపిలో.. కొత్తముఖాలు..!

- అధికార పార్టీలో భారీ మార్పులు
- ఔత్సాహికుల్లో ఉత్సాహం
- ఎమ్మెల్యే టిక్కెట్టు కోసం పరుగులు

సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతుండటంతో కొత్త ముఖాలు తెరపైకి వస్తున్నాయి. ప్రధానంగా అధికార వైసిపి పెద్దఎత్తున మార్పులు చేర్పులు చేపట్టే ఆలోచనలో ఉందని తెలియడంతో ఔత్సాహికుల్లో ఉత్సహం నెలకొంది. ఏదో రకంగా అధిష్టానం దృష్టిలో పడేందుకు అనేక రకాల ప్రయత్నాల్లో తలమునకలై ఉన్నారు. సిట్టింగ్‌ల్లో మాత్రం ఎక్కడ లేని గుబులు రేగుతోంది. తమ స్థానం ఉంటుందా... గల్లంతవుతుందా అన్న సందిగ్ధం వారిలో కన్పిస్తోంది. ఏదో రకంగా తిరిగి తమ స్థానాన్ని పదిలం చేసుకునేందుకు సిట్టింగ్‌లూ కసరత్తులు చేసుకుంటున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలున్నాయి. ఇందులో నాలుగైదు మినహా తక్కిన అన్ని స్థానాల్లోనూ మార్పులు చేపట్టే సూచనలు వైసిపిలో కనిపిస్తున్నాయి. దీంతో ఆయా నియోజకవర్గాల్లో నేతలు టిక్కెట్టు కోసం తిరుగుతున్న వారిలోనున్నారు. ఇందులో చూస్తే ఉమ్మడి జిల్లాలోని రెండు రిజర్వు స్థానాలు మడకశిర, శింగనమలల్లో మార్పులు చేపట్టే ఆలోచనలో వైసిపి అధిష్టానం చేస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. మడకశిర నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పేస్వామికి ఈసారి లేకపోవడంతో కొత్తగా రెండు పేర్లు వినిపిస్తున్నాయి. ఇందులో ఒకరు డాక్టర్ దివాకర్ టిక్కెట్టు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్న వారిలోనున్నారు. ప్రభుత్వ వైద్యులుగానున్న ఆయన రాజకీయ రంగ ప్రవేశం చేయడానికి సిద్ధపడుతున్నారు. అదే సమయంలో సిఐగా పనిచేస్తున్న శుభకుమార్ కూడా పోటీలోనున్న వారిలోనున్నట్టు ప్రచారం నడుస్తోంది. మరికొంత మంది కూడా ఆశిస్తున్న వారిలోనున్నారు. ఇక శింగనమల ఎమ్మెల్యేగా జొన్నలగడ్డ పద్మావతి ఉన్నారు. ఈసారి ఈమెకు అవకాశం లేకపోవచ్చునని ప్రచారం నడుస్తోంది. ఈ స్థానంలో డీఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాసమూర్తి పేరు వినిపిస్తోంది. ఇక మార్పులుండే నియోజకవర్గాల్లో పుట్టపర్తి నియోజకవర్గం కూడా ఉన్నట్టు సమాచారం. ఇక్కడ నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డితో దశాబ్ధాలుగా అనుబంధమున్న కృష్ణ సుమన్‌రెడ్డి (కిట్టూ) పేరు కూడా వినిస్తోంది. ఈయన కాకుండా మాజీ మంత్రి రవీంద్రారెడ్డి కుమారుడు ఇంద్రజిత్‌రెడ్డి, ఎస్వీ సోమశేఖర్‌రెడ్డి కూడా ఉన్నారు. కదిరిలో సిద్ధారెడ్డి కాకుండా మక్బుల్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా నియమించే అవకాశాలున్నట్టు పెద్దఎత్తున ప్రచారం నడుస్తోంది. ఇవి కాకుండా కళ్యాణదుర్గం, రాయదుర్గంలోనూ మార్పులు చేపట్టే ఆలోచనలున్నాయి. ఇక పోతే పార్లమెంటు రెండు స్థానాల్లోనూ మార్పులు తీసుకొచ్చే ఆలోచన వైసిపిలో నడుస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. హిందూపురం పార్లమెంటు సభ్యులుగానున్న గోరంట్ల మాధవ్‌కు ఈసారి అవకాశం ఉండకపోవచ్చు. దీంతో అదే సామాజికవర్గానికే టిక్కెట్టు ఇస్తారా లేదా మార్పులు చేస్తారా అన్నది చర్చ నడుస్తోంది. అదే సామాజికవర్గానికి చెందిన చిత్రా వెంకటేశ్ టిక్కెట్టు కోసం ప్రయత్నాలు చేసుకునే పనిలోనున్నారు. అనంతపురం పార్లమెంటుకు రంగయ్యకు కాకుండా ఆలూరు సాంబశివారెడ్డికి ఇస్తే ఎలాగుంటుందన్న ఆలోచన పార్టీ వర్గాల్లో నడుస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. ఆయన కూడా ఇంతవరకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాలేదు. భార్య పద్మావతి ఎమ్మెల్యేగానున్నారు. ఈ ఎన్నికల్లో ఆమెకు అవకాశం లేనందున ఈయనకు పార్లమెంటు ఇస్తారన్న ప్రచారం నడుస్తోంది. ఏది ఏమైనా వైసిపిలో చాలా వరకు కొత్త ముఖాలు వచ్చే ఎన్నికల్లో కనిపించే సూచనలు కనిపిస్తున్నాయి.

వీడియో కాన్ఫిరెన్స్‌లో ఖాళీగా ఉన్న కుర్చీలు..

'ఏం పాల్గొందాంలే అనుకున్నారు'..!

తూతూమంత్రంగా కార్పొరేషన్‌లో మెగా ఆరోగ్యశ్రీ వీడియోకాన్ఫరెన్స్

హాజరుకాని అధికారులు, కార్పొరేటర్లు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తూ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ మెగా అవగాహన ప్రచార కార్యక్రమం అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో నిరాదరణకు గురైంది. మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాల్లో సోమవారం ఉదయం నిర్వహించిన మెగా ఆరోగ్యశ్రీ అవగాహన కార్యక్రమానికి పాలకవర్గం నేతలు అధిక సంఖ్యలో కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు. దీంతొ సమావేశం బోసిపోయింది. ఏం పాల్గొందాంలే అనుకున్నారో ఏమోగానీ వీడియో కాన్ఫిరెన్స్‌కు ఎవరూ హాజరుకాలేదు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కమిషనర్ ఛాంబర్ నుంచి కార్పొరేటర్లకు వర్తమానం అందించారు. అయితే సోమవారం నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి వర్చువల్ వీడియో ప్రసార కార్యక్రమానికి కేవలం నలుగురు మహిళా కార్పొరేటర్లు, ఒక పురుష కార్పొరేటర్ హాజరయ్యారు. 11 గంటలు దాటినా కార్పొరేటర్ల జాడ లేకపోవడంతో కౌన్సిల్ హాల్ నుంచి కార్యక్రమాన్ని కమిషనర్ ఛాంబర్‌కు మార్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ప్రజారోగ్య విభాగ గుమాస్తాలు ఝాన్సీ, నల్లప్ప కార్పొరేటర్ బాల ఆంజనేయులు మాత్రమే పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా ఆరోగ్యశ్రీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కమిషనర్ భాగ్యలక్ష్మి కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్లకు వాట్సప్‌ల్లో ఆహ్వానం పంపారు. కమిషనర్ ఛాంబర్‌కు సైతం నలుగురు మహిళా కార్పొరేటర్లు, ఒక పురుష కార్పొరేటర్ మాత్రమే హాజరయ్యారు. పాలకవర్గ ముఖ్య నేతలు అధిక సంఖ్యలో కార్పొరేటర్లు గైర్హాజరు కావడంతో చేసేదేమీ లేక నలుగురు మహిళా కార్పొరేటర్లు వెళ్లిపోయారు. ఒక పురుష కార్పొరేటర్ మాత్రం కొంతసేపు ఉండి వెళ్లిపోయారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి కూడా కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్లు హాజరుకాకపోవడం ఏమిటంటూ పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

'కాపు' అవినీతికి సాక్షాధారాలివిగో : కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గం పరిధిలో అక్రమ లేఔట్ల ఏర్పాటులో ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అవినీతికి పాల్పడ్డారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అవినీతికి సంబంధించిన సాక్షాధారాల ను చూపారు. 74-ఉడేగోళం గ్రామ సమీపంలో జాతీయ రహదారి వద్ద కృష్ణానగర్ టౌన్‌షిప్ అక్రమంగా లేఅవుట్లు వేయగా అందులో 23 సెంట్ల విస్తీర్ణం గల 19, 20వ నంబర్ ప్లాట్లను లంచంగా తీసుకుని 2020లో కాపు తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని డాక్యుమెంట్లను మీడియాకు చూపారు. 2014 నుంచి నేటి వరకూ రాయదుర్గం పట్టణ పరిధిలో ఏర్పాటైన అన్ని అక్రమ లేఔట్లపై సమగ్ర విచారణ జరపాలని కాలవ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఇదే విషయంపై కాపు కూడా జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేయాలని సవాల్ చేశారు. కాపు ధన దాహానికి అక్కడ ప్లాట్లు కొన్న అమాయకులు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణానగర్ లేఔట్‌లో అక్రమంగా ఏర్పాటు చేసినవిద్యుత్ స్తంభాలు, లైన్‌పై ట్రాన్స్‌కో జెఎండికి లేఖ రాస్తానని తెలిపారు. కాపు అవినీతిపై త్వరలో మరిన్ని వివరాలు బయట పెడతానన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు - సమ్మెకు ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ మద్దతు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంగన్వాడీలకు సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నల్లప్ప, ఐద్వా మహిళా సంఘం రాష్ట్ర కోశాధికారి సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం నగరంలోని జెవివి కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్‌తోపాటు ఎస్ఎఫ్ఐ, ప్రజాసంఘాల నాయకులు అంగన్వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. కనీస వేతనం కోసం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, అధికార రాజకీయ వేధింపులు ఆపాలని ఏడురోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం రాకపోవడం బాధాకరమన్నారు. గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ విశిష్ట సేవలు చేస్తున్నా.. తగిన ఫలితం లేదన్నారు. సంవత్సరాలకొద్దీ సేవలు చేసినా రిటైర్‌మెంట్ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా ఇవ్వకుండా తొలగిస్తుందన్నారు. రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులతో నిత్యం సతమతమవుతూ ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. మరోవైపు ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అందడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు చిన్న ఆంజనేయులు, శ్రీనివాసరావు, హరి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, రామాంజనమ్మ, ఎస్ఎఫ్ఐ నాయకులు తరిమెల గిరి, సిద్ధు, రాచేపల్లి సూర్యప్రకాష్, శివ, భీమా, సోము, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి

జనరిక్ మందుల దుకాణాన్ని ఏర్పాటు చేయాలి

కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలో జనరిక్ మందుల దుకాణాన్ని ఏర్పాటు చేయాలని కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి స్థానిక నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలోని ఐదు మండలాల ప్రజలు చికిత్సల కోసం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి వస్తుంటారన్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రిలో లేని మందులను ప్రయివేటు మందుల షాపుల్లో తీసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారులు సూచించినప్పుడు మందులను అధిక ధరలతో కొనుగోలు చేసేందుకు పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున సరసమైన ధరలతోపాటు నాణ్యతతో కూడిన మందులను సరఫరా చేసేలా జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేయాలని కోరారు. రెండు రోజుల క్రితం ఆరోగ్య శాఖ మంత్రి సైతం జనరిక్ మందుల షాపులను ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని సూచిస్తే ఉరవకొండలో ఎక్కడో ఓ మూలన జనరిక్ మందుల షాపును ఏర్పాటు చేశారన్నారు. కావున ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మందుల షాపులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి జ్ఞానమూర్తి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కౌలు రైతుసంఘం నాయకులు

ఎస్ఆర్ఐటిలో విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థిని సోమవారం నాడు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పుట్లూరు మండలం ఎ.కొండాపురం గ్రామానికి చెందిన కవిత(20) ఎస్ఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాలలోని హాస్టల్‌లో ఉంటూ ఇసిఇ గ్రూపులో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం మధ్యాహ్నం భోజన విరామం తరువాత క్లాసుకు హాజరవలేదు. దీంతో సిబ్బంది హాస్టల్ గదిలో చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. సిబ్బంది అప్రమత్తమై కొన ఊపరితో ఉన్న కవితను కిందకు దింపి అనంతపురం నగరంలోని సవేరా ఆసుపత్రికి తరలించారు. అక్కడికి చేరుకునే సరికి మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అక్కడి నుంచి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలియడంతో ఆసుపత్రి వద్దకు కవిత తల్లిదండ్రులు , బంధువులు చేరుకున్నారు. తాను బాగా చదివి చెల్లెలు, తమ్ముడిని బాగా చదివిస్తానని కవిత చెప్పేదని కవిత తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఇలా ఎందుకు చేసుకుందో తెలియదని ఆవేదన వ్యక్తం చేసింది. చదువుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్టు సూసైడ్ లెటర్ దొరికినట్టు కొంత మంది చెబుతుండటం గమనార్హం. పోలీసులు మాత్రం దీనిపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. డీఎస్పీ శివారెడ్డి ఆసుపత్రి వద్ద పరిశీలించారు. విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మృతిచెందిన కవిత

ఆగని ఆగ్రహం..!

- అంగన్‌వాడీల పొర్లుదండాలు..!
- జిల్లా వ్యాప్తంగా 7వ రోజు కొనసాగిన సమ్మె

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై అంగన్‌వాడీల ఆగ్రహం ఆగలేదు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఆందోళనను మొక్కవోను అకుంఠిత దీక్షతో జిల్లా వ్యాప్తంగా కొనసాగిస్తున్నారు. సోమవారం 7వ రోజు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. వీరి అందోళనకు అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు దీక్ష శిబిరాల వద్దకెళ్లి మద్దతు తెలుపుతున్నారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట సాష్టాంగ నమస్కారాలు చేస్తూ నిరసన తెలిపారు. మండలాల్లో మానవహారాలు, చెవిలో పూలు పెట్టుకుని, ర్యాలీలు తదితర రూపాల్లో నిరసన తెలిపారు.

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు శిబిరం వద్ద రోడ్డుపై సాష్టాంగ నమస్కారాలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేసి మాట నిలుపుకోవాలని వేడుకున్నారు. సిఎం జన్మదినం వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు వైసిపి ఏర్పాట్లు చేస్తోంది. ఆ రోజు అంగన్‌వాడీలకు తీపి కబురు అస్తారని ఆశిస్తున్నామని వేడుకున్నారు. అనంతరం శిబిరంలో సమ్మె నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్ హెల్పర్ యూనియన్ నగర అధ్యక్షురాలు జయభారతి అధ్యక్షతన నిర్వహించిన సమ్మెకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి స్వప్న, నగర కార్యదర్శి జానకి, ఐఎఫ్‌టియు నాయకులు సురేష్, ఏసురత్నం, రైతు కూలీ సంఘం నాయకులు నాగరాజు, పిడిఎస్‌యు వీరేంద్ర ప్రసాద్, నిరుద్యోగుల ఐక్య వేదిక టిపి.రామన్న, కోఆపరేటివ్ సొసైటీ ఉద్యోగుల యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, హనుమంతరెడ్డి, మెడికల్ రెప్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సురేంద్ర, శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వన్నూరుస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగరాజు తదితరులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలు న్యాయమైన కోర్కెలే అడుగుతున్నారని, సిఎం ఇచ్చిన హామీ తెలంగాణ కంటే అదనంగా అంగన్‌వాడీలకు వేతనాలు ఇచ్చి మాట నిలుపుకోవాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో హక్కులు అడిగే స్వేచ్ఛ లేకుండా ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వీడాలన్నారు. చర్చలతో సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలి తప్ప బెదిరింపులతో కాదన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం విధానాలే ప్రజలు చూస్తారన్నారు. అధికారం ఉందని ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం మొండిగా అంగన్‌వాడీ కేంద్రాలను తాళాలు పగులగొట్టి ప్రారంభించడాన్ని ఆయా కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులు మండిపడుతున్నారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున, నాయకులు నక్షత్ర తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కొనసాగుతున్న సమ్మె వార్తలు 6లో

1 నుంచి నిరవధిక సమ్మె

అధికారులకు 'శ్రీరామిరెడ్డి' కార్మికుల నోటీసు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 1వతేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డిఆర్‌ఓతోపాటు, ఆర్‌డబ్ల్యుఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించడంతోపాటు పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ నాయకులు నాగరాజు, వన్నూరు స్వామి, గిరి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌ఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

నిరుద్యోగులపై నిర్లక్ష్యం తగదు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

నిరుద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని డివైఎఫ్ఐ నాయకులు అన్నారు. నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తూ పరిశ్రమలు మరిచిన సిఎం జగన్ ప్రభుత్వాన్ని గద్దెదిగాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక డిఆర్ఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఏపీఎస్‌సి మిల్, కాపర్ ఫ్యాక్టరీ, సభ్యుల ఫ్యాక్టరీ, సిమెంటు దిమ్మల ఫ్యాక్టరీ, తోళ్ల పరిశ్రమ తదితర పరిశ్రమలు ఏర్పాటైతే సుమారు 52,000 మందికిపైగా ఉపాధి దొరుకుతుందన్నారు. దీంతోపాటు అనుబంధ రంగాల్లో మరో లక్షమందికి ఉపాధి లభించేదన్నారు. రోడ్డు రవాణా, రైలు రవాణా ఉన్న గుంతకల్లును కళేబరంగా మార్చిన ఘనత రాజకీయ నాయకులకే దక్కిందన్నారు. ముఖ్యంగా ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ అధికారంలోకవ వచ్చాక మాట తప్పి సచివాలయం ఉద్యోగులను మాత్రమే ఏజెంట్లుగా మార్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు విద్యార్థులు ఉద్యోగాలు రాక ఆఖరికి వాలంటీర్లుగా మారి జగన్ సేవకులుగా పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించి పట్టణంలో మూతబడిన పరిశ్రమలను ఏర్పాలు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వీరికి డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.హిమబిందు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు చరణ్, ప్రతాప్, మారుతీప్రసాద్, చంద్ర, వైటిసి రమేష్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

పంచాయతీ కార్మికుల నిరవధిక దీక్ష

బుక్కరాయసముద్రం : పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు జిల్లా కార్యదర్శి శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుక్కరాయసముద్రం గ్రామపంచాయతీలో పని చేస్తున్న కార్మికులు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయా సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, రైతుసంఘం మండల నాయకులు సంజీవరెడ్డి, పంచాయతీ వర్కర్లు నాగరాజు, కొండన్న, నాగేంద్ర, సి.నాగేంద్ర, టి.నగేష్, వెంకట్, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

స్పందించే వరకు సమ్మెను ఆపం..!

కొనసాగిన అంగన్వాడీల సమ్మె - చెవిలో పూలు పెట్టుకుని, మానవహారాలు ఏర్పాటు చేసి నిరసన

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా వజ్రకరూరు మండల కేంద్రంలో చెవిలో పూలు పెట్టుకుని అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. అలాగే వీరికి మద్దతు తెలిపిన కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య మాట్లాడుతూ గర్భిణులు, చిన్నపిల్లలు, కిషోర్ బాలికలకు పౌష్టికాహారం అందించే అంగన్వాడీలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వాలు స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెకు సిపిఎం మండల కన్వీనర్ విరుపాక్షి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, జ్ఞానమూర్తి, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చెన్నరాయుడు, ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి బెంజిమెన్, హమాలీ సంఘం నాయకులు చిన్న ఆంజనేయులు, యనిమేలర్ల సంఘం నాయకులు సుధాకర్, రాజు, తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండల నాయకురాళ్లు విజయ, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, ధనలక్ష్మి, విజయ, శ్వేతనాగు, జ్యోతి, రామాంజినమ్మ, స్వర్ణలత, రామాంజనమ్మ, హేమలత, దేవి, లక్ష్మీదేవి, శశికళ, నాగమణి, శివశ్రీ, సువర్ణమ్మ, కృష్ణవేణి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండలం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం 7వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీ నాయకురాళ్లు రమణమ్మ, భారతి, ప్రమీల మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు ఏడు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీరి సమ్మెకు ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, మండల కార్యదర్శి సుంకన్న మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు బి.రత్నమ్మ, నాగేశ్వరమ్మ, రాజేశ్వరి, రామశ్రీ, రాధిక, ఓబుళమ్మ, హరిప్రియ, రామాంజనేయమ్మ, లక్ష్మీదేవి, బి.సరస్వతి, మహాలక్ష్మి, శ్రీలక్ష్మి, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం 7వరోజు కూడా కొనసాగింది. వీరి సమ్మెకు సిపిఎంతోపాటు పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సూరి మాట్లాడుతూ తల్లులు, పిల్లలు, బాలింతలకు పౌష్టికాహారం అందించే అంగన్వాడీల పట్ల ప్రభుత్వం చిన్నచూపు తగదని తగదన్నారు. సమస్యల పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా మండల కేంద్రంలోని 1వ అంగన్వాడీ సెంటర్‌కు పంచాయతీ కార్యదర్శి సరోజ, వీఆర్ఓ వెంకటనారాయణ సోమవారం తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. విషయం తెలుసుకున్న అంగన్వాడీలు సెంటర్ తాళాలు పగులగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుదర్శన్‌నాయుడు, రవికుమార్‌నాయుడు, డిసి ఓబుళనాయుడు, శ్రీనివాసులురెడ్డి, శివశంకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, తిర్మయ్య, పెద్దయ్య, మండల అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు జయలలిత, శశికళ, రమాదేవి, అనంతలక్ష్మి, నాయకులు జి.వెంకటచౌదరి, టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి నాగభూషణ్ అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం 7వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఎద్దులపల్లి రోడ్డు అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీగా వెళ్లి మానవహారంగా ఏర్పాటు చేసిన నిరసన తెలిపారు. అక్కడినుంచి తిరిగి ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న శిబిరం వద్దకు చేరుకుని సమ్మె కొనసాగించారు. వీరికి సిపిఎం నాయకులు సంపూర్ణ మద్దతు పలికారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లేష్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, అంగన్వాడీలు జయంతి, జె.ఎల్.నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు చిన్నారుల తల్లిదండ్రులు మద్దతు తెలిపారు. ఇందులో భాగంగా చిన్నారులతో కలిసి తల్లిదండ్రులు దీక్షలో సమ్మె దీక్షలు కూర్చొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ పిల్లలను రోజూ అంగన్వాడీలకు తీసుకెళ్లి పౌష్టికాహారం అందించడంతోపాటు ఆటపాటలు నేర్పి, విద్యాబుద్ధులు చెబుతున్న అంగన్వాడీ వర్కర్లపై ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామాంజనేయులు, కుల్లాయప్ప, అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 7వరోజు శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ అంగన్వాడీలు సమ్మె చేయబట్టి ఏడు రోజులు కావస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. తమ న్యాయమైన కోరికలు తీర్చమని ప్రభుత్వాన్ని అడిగితే తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వెంటనే సిఎం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి మేరీ, సెక్టార్ లీడర్లు మల్లక్క, చంద్రకళ, రాధిక, మెహ్రూన్, రుద్రమ్మ, అంగన్వాడీలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

గార్లదిన్నెలో ...

గుంతకల్లు : తమ న్యాయమైన పరిష్కారం చేయడంలో ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ఎన్టీఆర్ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా మాజీ కార్యదర్శి డి.శ్రీనివాసులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకురాళ్లు రేష్మా, గంగ, తదితరులు పాల్గొన్నారు.

పామిడిలో మానవహారం

పెద్దవడుగూరు : న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం కొనసాగింది. ఇందులో భాగంగా అంగన్వాడీ కార్యకర్తల సంఘం నాయకురాలు నాగరాణి, భాగ్యలక్ష్మి కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాతబస్టాండ్ ఆవరణంలో మానవహారంగా ఏర్పడి నిరసన చేపట్టారు.

పెద్దవడుగూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

బుక్కరాయసముద్రం : అంగన్వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన సమ్మె 7వరోజు సోమవారం కూడా కొనసాగింది. వారికి మద్దతుగా పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సంజీవరెడ్డి, సిఐటియు నాయకులు నాగేంద్రకుమార్, పంచాయతీరాజ్ వర్కర్స్ జిల్లా నాయకులు శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఏడవ రోజు కూడా కొనసాగింది. ఇందులో భాగంగా అంగన్వాడీలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. వీరికి సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గుత్తి : సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం గుత్తిలో 7వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు అనుబంధ సంస్థ ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీ కూడలి వరకూ నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకురాళ్లు కళ్యాణి, గంగ, శారద, నాగరత్న, భావమ్మ, రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెకు సోమవారం సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమల నాగరాజు మాట్లాడుతూ వారంరోజులుగా అంగన్వాడీలు సమస్యల పరిష్కారం కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వంలో ఇలాంటి చలనం లేదని తెలిపారు. ప్రభుత్వము నిరంకుశంగా ప్రవర్తిస్తే వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి పుట్టగతులు లేకుండా చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాగమ్మ, నల్లప్ప, అంగన్వాడీలు పాల్గొన్నారు.

శింగనమలలో మానవహారం

పుట్లూరులో అంగన్‌వాడి సెంటర్ తాళం పగులగొట్టిన వారిపై ఫిర్యాదు చేస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

ఉరవకొండలో సమ్మె చేస్తున్న అంగన్వాడీలు

ముున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి-తాడిపత్రి

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 21వ తేదీ నుంచి చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డికి వేర్వేరుగా తాడిపత్రి మున్సిపల్ కార్మికులు అందజేశారు. ఏపీ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి.రామాంజనేయులు, జగన్మోహన్, ఇంజనీరింగ్ సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉపాధ్యక్షులు జుబేర్, ఓబయ్య, మహబూబ్‌బాషా, పారిశుధ్య అధ్యక్ష, కార్యదర్శులు నరసింహమూర్తి, వన్నూరప్ప, ఇంజనీరింగ్, పారిశుధ్య కమిటీల సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పెద్దారెడ్డికి సమ్మె నోటీసులు అందజేసిన మున్సిపల్ కార్మికులు

ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వి.నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం సమస్యల పరిష్కారం కోరుతూ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించి సబ్సిడీ ద్వారా అందించాలన్నారు. కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలన్నారు. ఈ చలనాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో డిఆర్ఓ గాయత్రి దేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర న్యూ కమిటీ కార్యదర్శి ముత్తుజా, భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ ఆజాం బాషా, కార్యదర్శి ఆదినారాయణ, అంబులెన్స్ డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జిలాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

20న మెడికల్ రెప్స్ జాతీయ సమ్మె

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్‌ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 20న జాతీయ సమ్మె చేపడుతున్నట్లు మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్స్ యూనియన్ రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి మనోహర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకటనారాయణ తెలిపారు. ఈమేరకు సోమవారం నగరంలోని జెవివి జిల్లా కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందులు, మందుల పరికరాలపై జిఎస్‌టిని తీసివేయాలన్నారు. అత్యవసర, నిత్యావసర మందుల ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండేలా ధరలు తగ్గించాలన్నారు. నకిలీ నాసిరకం మందులు అరికట్టాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పునరుద్ధరించాలన్నారు. (ఎస్‌పిఈ) సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ చట్టాన్ని యథాతదంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్‌ల యూనియన్ జిల్లా అధ్యక్షులు సురేంద్ర, కార్యవర్గ సభ్యులు మంజునాథ్, ఇసాక్, రామసుబ్బారెడ్డి, అమర్‌నాథ్, ప్రసన్న, ఎఫ్ఎంఆర్ఏఐ కౌన్సిల్ సభ్యులు చంద్రశేఖర్, నాగరంగ, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ పోయినది

పందిర్లపల్లి రాఘవేంద్ర రెడ్డి S/o వీర రాఘవరెడ్డి, డోర్ నెం:8-483 పోతులయ్యపాలెం, గన్నెవారిపల్లి పంచాయతీ, తాడిపత్రి మండలం నందు నివసిస్తున్నాను. మా ఇంటి వద్ద నుంచి జిరాక్స్ కాపీల కోసం తీసుకుని వెళ్లేటప్పుడు నా **బిటెక్ ప్రొవిజనల్ సర్టిఫికెట్** ఎక్కడో పడిపోయింది. **స్టూడెంట్ ఐడి నెం:191712302.** ఆచూకీ తెలిసిన వారు **సెల్:7989901545** కు తెలపగలరు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం : మాజీ ఎమ్మెల్యే విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించి 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సైనికుల్లా పని చేద్దామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని దేవాంగ ఫంక్షన్‌హాలులో వైసిపి అనుబంధ సంఘాల ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల, గ్రామ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు గ్రామస్థాయిలో సమన్వయం చేసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సిఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విశ్వేశ్వర రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, మండలాల అధ్యక్షులు సుంకన్న, బైరెడ్డి రామచంద్రారెడ్డి, మచ్చన్న, సోమశేకర్‌రెడ్డి, ఎంపిపిలు కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, రమావత్‌దేవి, నారాయణరెడ్డి, నరసింహులు, పెద్దన్న, వైస్ ఎంపిపి శ్రీనాథ్‌రెడ్డి, జడ్పిటిసిలు పార్వతమ్మ, హనుమంతు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్, ఉరవకొండ సర్పంచి లలిత, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ సుశీలమ్మ, పిఎసిఎస్ ఛైర్మన్ వడ్ల షేక్షావలి, పట్టణ,రూరల్ అధ్యక్షులు ఏసీ ఎర్రిస్వామి, సుంకన్న, సమన్వయకర్త ఓబన్న, నేతలు చంద్రమ్మ, వెంకటరెడ్డి, త్రిలోక్‌రెడ్డి, బసవరాజు, శివలింగప్ప, ఆమిద్యాల రాజేష్, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న అనుబంధ కమిటీల సభ్యులు

'ఆరోగ్యశ్రీ, సురక్ష' పేదలకు వరం :ఎంపిపి

ప్రజాశక్తి-నార్పల

సిఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ పథకాలు పేదలకు వరం అని ఎంపిపి నాగేశ్వరరావు అన్నారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం చికిత్స నిమిత్తం రూ.5 నుంచి రూ.25లక్షలకు పెంపు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఆర్‌బికెలో లైవ్ టెలికాస్ట్‌ని వీక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతోనే సిఎం జగన్ ఈ పథకాలను శ్రీకారం చుట్టారన్నారు. వీటిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దివాకర్, రైతు, వ్యవసాయ మండల కమిటీ ఛైర్మన్ నాగలింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాకె కుళ్లాయప్ప, వైద్యసిబ్బంది శివకుమార్, అమృతాంజలి, ఫరీదా భాను, ఆశావర్కర్లు, వాలంటీర్లు, గ్రామస్తులు శివయ్య, నాగేష్, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

మిడ్‌పెన్నార్ నుంచి తాగు, సాగునీరు : ఎమ్మెల్యే పద్మావతి

పుట్లూరు : మిడ్‌పెన్నార్ సౌత్ కెనాల్ నుంచి లిఫ్ట్ ద్వారా తాగు, సాగు నీటి అవసరాల నిమిత్తం మడుగుపల్లి కుంటలకు నీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. ఈమేరకు మిడ్‌పెన్నార్ సౌత్‌కెనాల్ కాలువతోపాటు పుట్లూరు మండలంలోని మడుగుపల్లి గ్రామంలో ఉన్న బయన్నకుంటను సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా హెచ్ఎల్‌సి కెనాల్ నుంచి కుంటలకు నీటిని సరఫరా చేసే ప్రతిపాదిత అంశాలపై అధికారులతో చర్చించారు. దాదాపు రూ.5.45 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతన్నలకు సాగు, తాగునీటి కొరత లేకుండా చేసేందుకు సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే హెచ్ఎల్‌సి నుంచి కుంటలకు నీటిని అందించనున్నట్లు వివరించారు. ఈ కుంటలు నిండితే చుట్టుపక్కల గ్రామాలు జంగంరెడ్డిపేట, ఎల్లుట్ల, మడుగుపల్లి, మూగే తిమ్మంపల్లిలో తాగునీటి సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడిలో కోఆపరేటివ్ టౌన్‌బ్యాంకు ప్రారంభం

పామిడి : పట్టణంలోని బిసిసి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గుత్తి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు పామిడి శాఖను ఎమిరిటస్ విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ సభాధ్యక్షులు మానం ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు గుత్తి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు అధ్యక్షులు అబ్దుల్‌జిలాన్ మాట్లాడుతూ పామిడిలో గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ పామిడి శాఖ ఏర్పాటు కావడం శుభపరిణామమన్నారు. ప్రజలందరూ టౌన్‌బ్యాంకు సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మధుసూదన్‌గుప్తా, జితేంద్ర గౌడ్, కాకినాడ కో- ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు చిట్టూరి రవీంద్ర, చెలసాని రాఘవేంద్రరావు, వెంకటరత్నం, అచ్యుత రామారావు, అంబికా ప్రసాద్, శ్రీనివాసయాదవ్, బ్యాంకు సిఇఒ మహేశ్వర ప్రసాద్, పాలకవర్గ సభ్యులు కె.నాగరాజు, ఎం.కృష్ణ, డి.వెంకటేష్, జక్క వీరన్న, సి.నాగరాజు, జి.వెంకటేష్, ఎ.మహబూబ్, డి.దాదా, వై.రంగప్రసాద్, మహేష్‌కుమార్, రాజముద్దీన్, సుధీర్‌బాబు, శ్రీనివాసులు, వన్నప్ప, మహేశ్వర ప్రసాద్, నాయకులు జోజోడేకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆన్‌కాల్ డ్రైవర్ల అసోసియేషన్ ఏర్పాటు

ప్రజాశక్తి, నార్పల

స్థానిక రెవెన్యూ భవన్‌లో ఎపిపి టిడి ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జోనల్ నాయకులు కె.కొండయ్య అధ్యక్షతన ఆర్టీసీ ఆన్‌కాల్ డ్రైవర్ల అసోసియేషన్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా కె.నాగేంద్ర, ఉపాధ్యక్షులుగా ఎస్‌వి నారాయణ, కార్యదర్శిగా వి.ఎ.రెడ్డి, ట్రెజరర్‌గా గోపాల్, జాయింట్ సెక్రటరీగా మల్లికార్జున, ఆర్గనైజేషన్ సెక్రటరీగా నార్పల షేక్ దాదావలిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి జిల్లా అవుట్ సోర్సింగ్ ఛైర్మన్ కె.రామకృష్ణ, కల్లప్ప, పిఎస్ఎఖాన్, నాగరాజురెడ్డి, అనంతపురం డిపో కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వృద్ధురాలు అనుమానాస్పద మృతి

పెద్దపప్పూరు : వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మొక్కజొన్న పొలంలో మృతిచెందిన ఘటన సోమవారం మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ధర్మాపురానికి ఎందిన మాదినేని వరలక్ష్మి (52) నాలుగు రోజుల క్రితం ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చూపించుకునేందుకు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు. అయితే తల్లి ఇంటికి రాకపోవడంతో కూతురు బత్తలపల్లి పోలీస్‌స్టేషన్‌లో కనిపించలేదని ఫిర్యాదు చేసింది. మృతురాలి కుడి చేయి పూర్తిగా తొలగించి ఉంది. ఈనేపథ్యంలో మొక్కజొన్న కంకులు తెంపేందుకు వెళ్లిన క్రషర్ డ్రైవర్ గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు.

విద్యుదాఘాతంతో ఉపసర్పంచి మృతి

పెద్దవడుగూరు : ఇంట్లోని చెత్తను తొలగించే క్రమంలో విద్యుతుదాఘాతానికి గురై ఉప సర్పంచి రాజేశ్వరి (28) మృతిచెందిన ఘటన మండలంలోని కోనాపురం గ్రామంలో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రావులుడికి ఉపసర్పంచిగా పని చేస్తున్న రాజేశ్వరి తన ఇంటి వద్ద మెట్ల సమీపంలో చెత్తను ఊడ్చేస్తున్న తరుణంలో మెట్లకు ఉన్న ఇనుక కడ్డీలకు విద్యుత్ సరఫరా కావడంతో గమనించక పట్టుకుంది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఈమెకు భర్తతోపాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో వేడి ఆయిల్ చల్లిన వ్యక్తి

బొమ్మనహాల్ : చికెన్ కబాబ్(చికెన్ పకోడా)అప్పు ఇవ్వనందుకు దుకాణ యజమానిపై వేడి ఆయిల్ చల్లిన సంఘటన మండల పరిధిలోని దర్గాహొన్నూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాలు.. మహబూబ్ బాషా చికెన్ కబాబ్ సెంటర్ నడుపుతున్నాడు. చాకలి రాజశేఖర్ ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో మద్యం మత్తులో వచ్చి అప్పుగా చికెన్ కబాబ్ ఇవ్వాలని కోరగా బాషా నిరాకరించాడు. బీడీ కోరినా బాషా ఇవ్వకపోవడంతో ఆవేశానికి లోనైన రాజశేఖర్ స్టవ్‌పై వేడివేడిగా ఉన్న ఆయిల్ బాషాపై చల్లాడు. అయితే అతడు తృటి లో తప్పించుకోగా అక్కడే కబాబ్ కోసం వేచి ఉన్న అలహంబాషా, షఫీ, రుహితాజ్, ముసుముఖల్‌పై ఆయిల్ పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన బళ్లారిలో ఆసుపత్రికి తరలించారు. రాజశేఖర్‌పై కేసు నమోదు చేసి అతడి కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడల్లో గేట్స్ విద్యార్థి ప్రతిభ

గుత్తి : అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 2023-24 లో గేట్స్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ చాటాడు. గేట్స్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ చదువుతున్న డి.హిమంత్ రాజ్ బ్యాడ్మింటన్ సింగిల్స్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రన్నర్స్ ట్రోఫీ సాధించాడు. క్రీడల్లో రాణించిన విద్యార్థిని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ సురయ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు, ఫిజికల్ డైరెక్టర్ జోయల్ అధ్యాపకులతో పాటు పలువురు అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో ట్రోఫీలు సాధించాలని ఆకాంక్షించారు.

పంచాయతీరాజ్ వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటరాముడు

గుత్తి : జిల్లా వైసీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బేడల వెంకటరాముడును నియమించారు. గుత్తి మండలం వన్నేదొడ్డి గ్రామానికి చెందిన సివిల్ ఏ.1 కాంట్రాక్టర్, వైసీపీ సీనియర్ నాయకులు బేడల వెంకటరాముడు వైసీపీ పార్టీలో చురుగ్గా పని చేస్తుండడంతో ఆయనకు ఈ పదవి దక్కింది. తనకు ఈ పదవి అప్పగించడంతో సిఎం జగన్, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఇఒల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బి.రవినాయక్

గుత్తి: మండల విద్యాధికారుల-1 అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా గుత్తి ఎంఇఒ-1 భూక్య రవినాయక్ ఎన్నికయ్యారు. ఎంఇఒల రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పాటులో భాగంగా గుత్తి మండల విద్యాధికారి-1 ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన బి.రవినాయక్‌ను వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘంటసాల సంగీత కళాభారతి నూతన కమిటీ ఎన్నిక

అనంతపురం కలెక్టరేట్ : పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు సుగమంచి సురేష్, ప్రధాన కార్యదర్శి వి.మారుతీప్రసాద్ తెలిపారు. సోమవారం కళాభారతి సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఘంటసాల సంగీత కళాభారతి గౌరవాధ్యక్షులుగా రవికాంత్ రమణ, అధ్యక్షులుగా సుగుమంచి సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా మారుతీప్రసాద్‌నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసులు, ఎన్.విజయరామయ్య, ఓ.సర్దార్‌బాబు, కోశాధికారిగా హెచ్.ఆదినారాయణ, సహ కార్యదర్శులుగా ఎం.ఆదినారాయణ, కె.శ్రీదేవి, ఏ.జ్యోతి, హైదర్‌వలి, కార్యవర్గ సభ్యులుగా కె.మునిరత్నం, ఎం.పెద్దన్న, కె.జయబిందు ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎస్ఎస్‌బిఎన్ తెలుగు అధ్యాపకులకు పురస్కారాలు

అనంతపురం : నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు తెలుగు అధ్యాపకులు ఎపిజె అబ్దుల్‌కలం గురు పురస్కారాలను అందుకున్నారు. గుంటూరు జిల్లా హిందూ కళాశాలలోని సుధర్మ ఆడిటోరియంలో డాక్టర్ చివుకుల హనుమంతరావు ట్రస్టు, సైన్సు అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఎస్‌బిఎన్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ నల్ల ఓబిరెడ్డి, వాధులపల్లి ఫిరోజా పురస్కారాలను అందుకున్నారు. వీరు వివిధ రకాల తెలుగు సాహిత్య, విజ్ఞానం, విద్యారంగాల్లో చేసిన కృషికి పురస్కారాలను అందజేయడంతోపాటు ఘనంగా సత్కరించారు.

గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వినతి

నార్పల : మండల కేంద్రంలోని పాత బస్టాండ్ కూడలిలో తొలగించిన గాంధీజి విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచి కమలమ్మ, ఉప సర్పంచి హుసేన్‌పీరా సోమవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో టిడిపి నాయకులు పరంధామ, తదితరులు ఉన్నారు

వినియోగదారుల హక్కులపై ర్యాలీ

పామిడి : జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ టిసి హైస్కూల్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ఎద్దులపల్లి రోడ్డు వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా 'వినియోగదారుడా మేలుకో.. చట్టం నీకు కల్పించిన హక్కులను తెలుసుకో' అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఈ-కామర్స్, డిజిటల్ వర్తక శకంలో వినియోగదారుల రక్షణ, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఎస్ఐకి సన్మానం

కుందుర్పి :కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ వెంకటస్వామిని సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలోని ఎనుములదొడ్డి గ్రామపంచాయతీ వైసిపి నాయకులు ఘనంగా సన్మానించారు. సర్పంచి తనయుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అసాంఘిక శక్తుల ఆట కట్టించాలని, ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎస్ఐ మాట్లాడుతూ సర్పంచులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు సహాయ సహకారాలతో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మ లింగప్ప, తిప్పేస్వామి, కాశీంసాబ్, ఆనంద్, శివన్న, చిన్నప్ప, బాబు, తదితరులు పాల్గొన్నారు.